(ఒక్క బెంగుళూరు నగరంలోనే సంవత్సరానికి 200 మంది వళ్ళు కాలి చనిపోతూ ఉంటారు. అందులో 190 మంది ప్రమాదవశాత్తు చనిపోయినవారైతే, నలుగురు హత్య చేయబడినవారు, ఆరుగురు ఆత్మహత్య చేసుకొన్నవారు. వళ్ళు కాల్చుకొని ఆత్మహత్య చేసుకొనేవారు సాధారణంగా స్త్రీలు. క్షణికోద్రేకంవల్లో, విపరీతమైన నిస్పృహతోనో ఈ పని చేస్తారు. వళ్ళంటించుకొని చనిపోవడానికి కారణం కిరసనాయిలు వీరికి అందుబాటులో వుండటం. ఆరకపు చావు చాలా బాధాకరమైనది. చనిపోయినవారు చనిపోగా, మధ్యలో బాధ భరించలేక గోలచేసి రక్షింపబడి, అనాకారులుగా శేషజీవితం గడిపేవారు కొందరు. చనిపోయిన స్త్రీ భర్తని, అత్తా ఆడబిడ్డలని చుట్టూ సమాజం, పోలీసులు హంతకులుగా అనుమానిస్తారు. కావాలని కాకపోయినా మానసికంగా చిత్రహింసకు గురిచేస్తారు. ఆ స్త్రీ కనుక బతికి బయటపడితే ఆమెమీద ఆత్మహత్యా నేరం మోపబడుతుంది.

ఈ కథ చదివి ఏ ఒక్క 'చెల్లి' అయినా అటువంటి ప్రయత్నం జోలికి పోవడం మానేస్తుందేమో అన్న ఆశతో....

—రచయిత)

# సావిత్రి

కవనశర్మ

*"హీరో చెల్లెలు 'నేను మోసపోయానన్నయ్యా' అంటుంది." సీత కృష్ణుడికి ఆ క్రితం రోజు చూసిన సినిమా కథ చెప్తోంది.*

"మోసపోవడం అంటే ఏమిటి సీతక్కా?" అని సీతని కృష్ణుడు అడిగాడు.

"ఎవరికైనా కొన్నాళ్ళకి పాపాయి పుట్టబోతోందనుకో— అదన్నమాట మోసపోవడం అంటే."

ఆ సమయంలో రేగిన జుట్టుతో ఏడ్చి ఎఱుపెక్కిన కళ్ళతో సావిత్రి వచ్చింది. సావిత్రి చంకలో ఏణ్ణర్థం వయస్సున్న జ్యోతుంది.

పొడుగ్గా రైలు పెట్టెలా వున్న ఇంట్లో మూడు భాగాలు-ఒక దాన్నొకటి ఆనుకొని ఉన్నాయి. మధ్య భాగంలో సావిత్రి, రామారావు వుంటున్నారు. ఒక చివరి భాగంలో సీత, ఆ పిల్లతల్లి సుభద్ర, తండ్రి శంకరరావు. రెండో చివర కృష్ణుడు ఆ పిల్లాడి తల్లి కామేశ్వరి, తండ్రి నరసింహమూర్తి వుంటున్నారు.

"కాస్సేపు మా జ్యోతిని చూసిపెట్టే సీతా!" అని సావిత్రి అడిగింది.

లోపల్నుంచి సుభద్ర వచ్చి "మళ్ళ యేమన్నా గొడవ పడ్తున్నారా సావిత్రి, గారు?" అని అడిగింది.

"గొడవలకేం భాగ్యం! ఆ మనిషి వుద్యోగం, రూపం, ఆస్తిచూసి మోసపోయాను" అంది సావిత్రి.

"ఆంటీ, మీకు పాపాయి పుట్టబోతోందా?" అని కృష్ణుడు అడిగాడు.

"షటప్" అని సావిత్రి కృష్ణుడికసిరి జ్యోతిని దింపి వెళ్ళిపోయింది.

సీత అప్పటికే బాగా చిరిగిపోయిన పత్రిక ఒకటి తెచ్చి చింపడానికి జ్యోతికిచ్చి కథలో పడింది.

పావుగంట గడిచింది. ఈ లోపల హీరో చెల్లెల్ని మోసపుచ్చిన విలన్, హీరోయిన్‌ని పెళ్ళిచేసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలన్నీ విపులంగా సీన్లప్రకారం చెప్పింది సీత.

"విలన్‌కి, హీరోయిన్‌కి పెళ్ళి నిశ్చయం అయి ఆ పెళ్ళి శుభలేఖ హీరోయిన్, హీరోకిస్తుంది. దాన్ని హీరో చెల్లెలు చూస్తుంది. ఆ రాత్రి ఆ అమ్మాయి పరుగెత్తి కొండ చివరకు చేరుకొంటుంది అక్కడ్నుంచి దూకేయాలన్న ఉద్దేశంతో. ఇంతలో...."

"ఆగు! ఆగు! అంతపని చెయ్యకు" అని అరిచిందో మగ గొంతుక. ఆ గొంతుక సావిత్రి భర్త రామారావుది. సీతా కృష్ణుడు ఉలిక్కిపడ్డారు. సుభద్ర, శంకరరావు, కామేశ్వరి, నరసింహమూర్తి ఉమ్మడి పెరట్లోకి పరుగెత్తారు. వీళ్ళు అక్కడికి చేరుకొనేసరికి రామారావు పెరట్లో వున్నాడు. వెయ్యని కిటికీ తలుపు లోంచి స్నానాల గదిలో ఉన్న సావిత్రి కనిపిస్తోంది.

సావిత్రి మీద కిరసనాయిలు పోసుకొంది. అంటించుకోకుండా ఆపండి" అన్నాడు రామారావు కంగారుగా.

స్నానాల గదిలో మూతతీసిన స్టౌ ఉంది. కిరసనాయిలు వాసన. తడిసినట్టుగా కనిపిస్తున్న చీర ఇరుగుపొరుగు వారికి సావిత్రి

చెయ్యబోతున్న దారుణ ప్రయత్నం అర్థమయ్యేలా చేశాయి.

ఆడవాళ్ళిద్దరు "వద్దు సావిత్రిగారూ! బతికుంటే బలుసాకు తినచ్చు" అని గందరగోళంగా అరుస్తూ ఆమెను ఆ ప్రయత్నం నుంచి మరల్చాలని చూస్తున్నారు.

"లోపలికి వెళ్దాం పదండి" అన్నాడు శంకరరావు.

"నన్ను బయటకి నెట్టి రెండు వైపులా తలుపులు బిడాయించింది." అది సాధ్యం కాదని సూచించాడు రామారావు.

"తలుపులు విరగ్గొట్టడదాం" అన్నాడు శంకరరావు యేదో వొకటి చెయ్యాలన్న ఆత్రుతతో.

"ఈ లోపల ఆవిడ అంటించుకొంటే మనం తలుపులు విరక్కొట్టే లోపల ప్రాణం పోతుంది" అన్నాడు నరసింహమూర్తి.

సుభద్ర, సీత చేతిలోవున్న జ్యోతిని అందుకొని, సావిత్రికి చూపిస్తూ "జ్యోతి మొహం చూసైనా ప్రయత్నం మానుకోండి" అంది. జరుగుతున్నది అర్థంకాక జ్యోతి నవ్వులు వలకబోసింది.

"తలుపులు తెరవండి" అంది కామేశ్వరి.

"నిన్న సినిమాకికూడా వచ్చారుకదా! ఇవాళ తెల్లారి ఏమైంది?" అని అడిగాడు శంకర్రావు.

"నిన్న సినిమాలో పాప వేసుకొందే అల్లాంటి ఫ్రాకు జ్యోతికి ఈ దీపావళి పండుగకి కొనాలంది. పొద్దున్నే అట్లు పోస్తూ అంత ఖరీదైన ఫ్రాకు కొనడానికి డబ్బు లేదన్నాను. నాకు తాహతు లేదన్నాను" అన్నాడు రామారావు.

సావిత్రికి అరగంటక్రితం తనకి, రామారావుకి జరిగిన పోట్లాట అంతా గుర్తుకు వచ్చింది. ఆపైనకోపం ముందుకు వచ్చింది.

"నీకు అసలు జ్యోత న్నా, నేనన్నా యిష్టంలేదు. అందుకే కొనవు డబ్బులేక కాదు. నువ్వు పిసినారివి. అందుకే నేను ఛస్తున్నాను" అని ఉద్రేకంగా భర్తని సావిత్రి ఏకవచనంలో దూషించింది.

కామేశ్వరి "జ్యోతికి మంచి చొక్కాలే గాని మంచి తల్లి అక్కర్లేదా? మీరు చచ్చిపోతే జ్యోతికి సవతి తల్లి వస్తుంది" అంది.

వీళ్ళందరి ధోరణి చూస్తే తన చావు తనని చావనిచ్చేటట్టు లేరు, అని సావిత్రి భయపడి అగ్గిపుల్లగీసి చీర అంటించుకొంది. మంటలు నిలువెత్తున లేచాయి. కామేశ్వరి మాటల అర్థం మనస్సుకి వచ్చేసరికి మంటల సెగ వంటికి తగిలింది. తన జ్యోతికి తను మాత్రం వద్దా! తను ఎంత తెలివితక్కువపని చేసింది! సావిత్రి పెరటి తలుపువేపు పరుగెత్తింది "హెల్ప్! హెల్ప్" అని అరుస్తూ.


నరసింహమూర్తి స్కూల్లో టీచరు. అలవాటుకొద్దీ నాయకత్వం తీసుకొన్నాడు.

"శంకరరావుగారు మీరు గోనె పట్టాగాని, మొద్దు దుప్పటిగాని తీసుకురండి. కామేశ్వరీ! నువ్వు కత్తెర తీసుకురా! రామారావుగారూ ఆవిడ బయటకి రాగానే మీరు చీర వూడలాగి పారెయ్యండి. సుభద్రగారు మీరు జ్యోతిని సీతకిచ్చి రెడీగా వుండండి. సావిత్రిగార్ని మన్నులో పొర్లిద్దాం."

"అమ్మోయి! బాబోయి! మంట! భరించలేను!" అంటూ సావిత్రి పెరట్లోకి వచ్చింది. ఆమె నంటుకొని నాలుకలు సాచి వికృతంగా తాండవంచేస్తూ మంటలు పైకి లేస్తున్నాయి. తల్లిని మంటల్లో చూసి సీత చేతుల్లోని జ్యోతి ఏడుపు మొదలు పెట్టింది.

సిద్ధంగాఉన్న రామారావు చీర లాగి పారేశాడు. కామేశ్వరి లోపలి పరికిణీ బొందు కత్తెరతో కత్తిరించడం శంకరరావు మొద్దు దుప్పటితో సావిత్రిని చుట్టడం ఒకసారే చేశారు. లోపలి పరికిణీ కుప్పగా కిందపడిపోయింది. నరసింహమూర్తి, సుభద్ర సావిత్రిని పట్టుకొని మన్నులోపొర్లించి జాకెట్టుకి ఉన్న మంట లార్పేశారు.

శంకరరావు యింటివాళ్ళు యింటి నుంచి ఆంబులెన్సుకి ఫోను చేశాడు. రామారావు, నరసింహమూర్తి సావిత్రిని సాయంపట్టి లోపలి మంచంమీదకు చేర్చారు. వంటికి అతుక్కుపోయిన జాకెట్టుని, బాడీని ఊడపీకాలని సుభద్ర ప్రయత్నిస్తుంటే "అమ్మా! వళ్ళు బాగాకాలి వంటికి బట్టలు అంటుకుపోతే అవి మనం పీకరాదని మా స్కూల్లో ఇచ్చిన పుస్తకంలో వుంది. వాటిని డాక్టర్లు జాగ్రత్తగా తియ్యాలిట" అంది సీత.



సీతచేతిలోజ్యోతితల్లి కేసి చెయ్యి చాస్తూ "అమ్మ, అమ్మ" అని బెంగగాను, భయంగాను యేడ్చింది. సావిత్రి కళ్ళు తెరవ


బోయి తెరవలేక సన్నటి స్వరంతో "పాప నా పాప!" అంది.

"ఆంబులెన్సు వచ్చేలోపల వంటికి నూనె రాయనా?" అని కామేశ్వరి భర్తను అడిగింది.

"ఆంటీ! వంటికి నూనె రాయరాదు. ఐసు పెట్టాలి" అంది సీత.

"సువ్వూ కృష్ణుడు జ్యోతిని తీసుకొని కాస్సేపు బయటకిపోయి ఆడుకోండి" అని సుభద్ర వాళ్ళను బయటకు పంపించేసింది.

నరసింహమూర్తి ఇంటి వాళ్ళింటి



నుంచి ఐసు తెచ్చి బాగా కాలిన ప్రదేశాల్లో కొద్ది కొద్దిగా పెట్టాడు.

"బొబ్బలెక్కుతాయేమోనండి" అంది కామేశ్వరి భయంగా. సావిత్రి ప్రాణానికి ఏదైనా అయితే, మంచికి పోయినందుకు గాను తన మొగుడిని తిట్టుకొంటారేమో నన్న భయం ఉంది ఆ మాటల్లో.

"పిచ్చిదానా! బొబ్బలెక్కితే కావాల్సిందేముంది? వళ్ళు పైపైన కాలినప్పుడు మాత్రమే బొబ్బలెక్కుతాయి. బాగా కాలినప్పుడు బొబ్బలెక్కవు" అన్నాడు నరసింహమూర్తి సావిత్రి వంటికి ఐసు పెడ్తూ.

రామారావు కింకర్తవ్యతా మూఢుడయి యెవరేది చెయ్యమంటే అది చేస్తూ నిలబడ్డాడు.

ఆంబులెన్సు వచ్చింది. అది వచ్చిన కొద్దిసేపటికి పోలీసు వాన్ వచ్చింది. పోలీసులు రాగానే యిల్లు గలాయన వచ్చాడు ఆయన ప్లీడరు. పోలీసులు "ఏం జరిగింది?" అని ఎవరిన్నీ ప్రత్యేకించి వుద్దేశించకుండా అడిగారు.

శంకరరావు చెప్పబోతుండగా ప్లీడరు కల్పించుకొని "ఆ అమ్మాయి అల్లాపోస్తోంది. స్టవ్స్ సరిగా పని చెయ్యడం లేదని వాటిని స్నానాల గదిలోకి తీసుకు వెళ్ళింది. అంతకుముందే మొగుడితో చిన్న దెబ్బలాట ఆడటంవల్ల మనస్సు బాగాలేదు. పైగా స్టవ్‌లు సరిగ్గా పనిచెయ్యక పోవడంతో విసురుగా విసుగ్గా వాటిని బాగు చెయ్యబోయింది. వాటిని ఆర్పకుండానే. దాంతో కిరసనాయిలు మీద ఒలికి చీరకి నిప్పంటుకుంది" అని చెప్పాడు.

నరసింహమూర్తి, శంకరరావు తమకి ఇంటాయన అన్యాపదేశంగా చెప్పింది అర్థం చేసుకొని అక్కడ్నుంచి జారుకొని పోలీసులేం జరిగిందని అడిగితే ఏం చెప్పాలో తమ భార్యలకి, రామారావుకి చెప్పారు.

"మధ్యలో పోలీసుల బెడదేమిటి చస్తుంటే సంధ్య మంత్రంలా" అంది కామేశ్వరి.

"పెళ్ళయిన అయిదు సంవత్సరాల లోపలో ఎన్ని సంవత్సరాల లోపలో ఏ అమ్మాయయినా బలవంతపుచావుచస్తే దాని గురించి పోలీసుల్ని పూర్తిగా విచారణ జరుపమని ఆర్డర్ వేసిందట ప్రభుత్వం". అంది సుభద్ర.

"కొందరిళ్ళలో కోడలు వాళ్ళు కోరిన కట్నాలు, కానుకలు తేలేదని కోడల్ని నానా హింసలు పెట్టడం, చంపడం చేస్తున్నారు మరి."

"చంపకపోయినా ఆ బాధలు భరించలేక కోడళ్ళే ఆత్మహత్యలు చేసుకొంటున్నారని పేపర్లలో వస్తోందిగా."

"పెళ్ళాం ఛస్తే మొగవెధవలు మరొక అమాయకురాలి ఉసురు పోసుకోడానికి సిద్ధపడ్తారు" అంది కామేశ్వరి రామారావుకి వినపడేలాగా.

ఆంబులెన్సు మనుష్యులు స్ట్రెచర్ తీసుకొని లోపలికి వచ్చారు. వాళ్ళ వెంటే పోలీసులు కూడా లోపలికి వచ్చారు. సావిత్రికి స్పృహ లేకపోవడంచేత ఆమెదగ్గర స్టేట్‌మెంటు తీసుకోడానికి పోలీసులకి కుదరలేదు. వాళ్లు స్నానాల గదీ అవీ చూసుకొని రామారావుని ఒకటి రెండు ప్రశ్నలడిగి అతనిచ్చిన జవాబులు, ఇంటాయనచెప్పిన దాంతో ఏకీభవించడంతో తృప్తిపడి వెళ్ళిపోయారు.

సావిత్రిని స్ట్రెచర్‌తోపాటు ఆంబులెన్సులోకి యెక్కించారు. రామారావు యెక్కాడు శంకరరావు, నరసింహమూర్తి ఆంబులెన్సు యెక్కబోతుంటే యింటాయన పక్కకి పిలిచి "ఆ అమ్మాయికి యేమైనా అయితే నా యింటికి తీసుకు రాకండి. అక్కడ్నుంచి అల్లాగే తీసుకు వెళ్ళండి. నా యింటికి శవం రావడం నా కిష్టం వుండదు" అన్నాడు.

"అల్లా ఆశీర్వదించకండి. పెద్దలు మీరనాల్సిన మాటలు కావు" అన్నాడు శంకరరావు.

నరసింహమూర్తి అసహ్యంతో మాట్లాడలేదు. అద్దెకున్న వాళ్ళు ఆయన కళ్ళకి మనుష్యుల్లా కనపడరు కాబోలు. గత సంవత్సరం ఆయన భార్య పోయినప్పుడు సావిత్రి ఆయన్ని ఓదార్చి వండి పెట్టింది. అటువంటి సావిత్రి సజీవంగా తనింటికి రావాలని కోరుకోక శవంగా వస్తుందేమోనని బెంగపెట్టుకొనే ఈ మనిషి ఎటువంటి మనిషి? తన భార్య శవం ఇంట్లో వుంచుకోక వీధిలో పారేశాడా? మళ్ళీ మాట్లాడితే తన పెద్ద కూతురు

ఉన్నత ప్రమాణాంగల పుస్తకాలు

350 జపాన్ పరిశ్రమల గైడ్ 15/-; 300 డబ్బు సంపాదించే పథకాలు 15/-; టైలరింగ్ అండ్ కటింగ్ ఫ్యాషన్ పుస్తకంతో 16/-; ఎలక్ట్రిక్ రేడియో అండ్ ట్రాన్సిస్టర్ గైడ్ (బొమ్మలతో) 15/- డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ (400 బొమ్మలు) 12/- కోక్‌శాస్త్రం 12/- ప్రైవేటు ఫొటో ఆల్బం 25/- మెడికల్ సెక్స్ గైడ్ 10/- నూతన వివాహ జీవితం 100 ఫొటోలతో 12/- కామసూత్రం 17-50 ఫొటోగ్రఫీ గైడ్ 10/- పోస్టేజి అదనం.

AMAN BOOK DEPOT
Phafala (AJ-2), ALIGARH-(U.P.)

WHEN NATURE FAILS

మరింత ఎత్తు, పొడుగు కాగలరు

H New Super eight 2 నుండి 8 అం. వరకు పూచీ. (For Super Heightness) మీరూ పొడుగు పెరగదలచుకుంటే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా హైటెక్స HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for po-pular people I phail (20 TABS) Rs. 7 50 advance By M O 3 Phails (60 Tabs) Rs. 15/- money order by advance.

M/s London Commercial Coy
Beat No 1, House No 3883 X
Ambalacantt—133001 (N 2)
Correspond in English (AJW/7/79)

అందరినీ అలరించే
"జ్యోతిచిత్ర"
చదివి ఆనందించండి!

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గలవారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిని పొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సుతోనే మచ్చల రంగు మారడం ఆరంభమవుతుంది. జబ్బు వివరాలు వ్రాయండి

GAUTAM CHIKITSALAYA
(S-DD)
P.O.) KATRI SARAI (GAYA)


దూరంనుంచీ రావాలని మర్నాటిదాకా వుంచాడు. అనాధప్రేత సంస్కారానికి కోటి యజ్ఞఫలం అన్నా ఒకవైపు శవాల పట్ల మనుషులకుండే భయాలు పోగొట్టాలని శాస్త్రాలు ఘోషిస్తూనే వున్నా, ఇల్లు పాడుపెట్టాల్సి రావటం, దయ్యాలు, చెడు నక్షత్రాలు, పీడ మొదలైన మూఢ నమ్మకాలకి జనం జడిసి, తోటిమానవులకి సానుభూతి, ఆదరణ చూపించాల్సిన ఇటువంటి సమయాల్లో నిర్దయగా ప్రవర్తిస్తారు, అనుకొన్నాడు నరసింహమూర్తి.

శంకరరావు, నరసింహమూర్తి ఆంబులెన్సు ఎక్కాగా అది కదిలింది.

ఆంబులెన్సు వెళ్ళిపోయాక కామేశ్వరి కాలు చెయ్యి ఆడక ఏమీ తోచక సుభద్ర యింటికి వెళ్ళి కూర్చుంది.

"నిన్న సినిమాలో సావిత్రీ వాళ్ళు మా ముందరి వరుసలో కూర్చున్నారు. ఇంటర్‌వెల్‌లో ఎన్ని కబుర్లు చెప్పిందీ! 'దీపావళికి వాణిశ్రీ కట్టుకొన్న చీరలాంటిది కొనుక్కోవాలని వుంది!' అంది. "బుధవారం మనిద్దరం హిందీ సినిమాకి వెళ్దామా?" అని అడిగింది. అల్లాంటిది యివాళ పొద్దున్నకి జీవితంమీద యింత విరక్తి పెంచుకొందీ!" అంది సుభద్ర.

"సావిత్రికి పుద్రేకం పాలు హెచ్చు. ఆ మొగుడేమో చాపకింద నీరు బాపతు", అంది కామేశ్వరి.

"రోజూ ఆయన ఆఫీసుకు వెళ్తుంటే సావిత్రిగారు జ్యోతి నెత్తుకొని కాంపౌండు గేటుదాకా వెళ్ళి అక్కడ నిలబడి ఆయన వీధి మలుపు తిరిగేదాకా చెయ్యి వూపుతూ నిలబడేది. అలాంటి సావిత్రిగారు ఆయన పిల్లకి ఖరీదైన గౌను కాకుండా కాస్త చవకలో కొంటానని అన్నారని వంటికి నిప్పంటించుకొందంటే నమ్మలేకుండా ఉన్నాను" అంది సుభద్ర.

"జీవితంలో పెద్ద కష్టాలనుభవించని వాళ్ళకి చిన్నవే పెద్దగా కనిపిస్తాయి మా పిన్ని కూతురు, దాని మొగుడమెరికా వెళ్తే అతన్తోపాటు తనూ అమెరికా వెళ్ళాలని చాలా అనుకొనేది. దానికి అమెరికా పిచ్చి అతను అమెరికా వెళ్ళే అవకాశం వస్తే వదులుకొన్నాడని కోపంతో అతన్ని విడిచిపెట్టేసింది. నాలాంటివాళ్ళు సినిమాకి వెళ్ళడంలాంటి కనీసపు కోర్కెలు తీరకపోయినా నోరు మూసుకొని ఏ సుఖానికి ఆశించకుండా బండి లాగించేస్తా వుంటారు" అని కామేశ్వరి మధ్యలో తన గోడు చెప్పుకొంది.

"అప్పుడప్పుడు గిల్లి కజ్జాలాడుకొన్నా ప్రతిరోజు సాయంత్రం చెట్టాపట్టాలేసుకొని చిలకా గోరింకలలాగా షికార్లు కొట్టారుకదా! ఇద్దరిలోకి ఆయనే సౌమ్యుడిలాగా కనిపిస్తాడు."

"ఏం సౌమ్యుడో ఏమిటోనండి! మీరీ భాగంలోకి రాకముందు నుంచి వాళ్ళు మాకు తెలుసు. అతనుత్త నస మనిషి. పెళ్ళాన్ని సాధించి చంపేవాడు. మొదట్లో సావిత్రి మొండిగా ప్రవర్తించేది. పెళ్ళయిన కొత్తలో ఎవరిది పైచెయ్యో తేల్చుకోడానికి చాలా తరుచుగా దెబ్బలాడుకొనేవారు. ఏ రోజైనా సావిత్రి కోపంతో వంట చెయ్యకపోతే తను బయట భోంచేసి ఏమీ తిననట్టు ముసుగు బిగించి పడుకొనేవాడు. ఒకరోజు పొద్దున 'ఏమండీ సావిత్రిగారూ! నీరసంగా కనిపిస్తున్నారేం' అని అడిగాను. 'నిన్న నేను, మా ఆయన పోట్లాడుకొన్నాం. నేను వంట చెయ్య

## కొత్త రచయిత్రులు



పుట్టిందీ, పెరిగిందీ కాకినాడలో. 1966లో వివాహమైంది. శ్రీవారు వసుంధర కలం పేరుతో రచనలు చేస్తుంటారు. శ్రీవారి ఉద్యోగరీత్యా సుమారు తొమ్మిది సంవత్సరాలుగా భువనేశ్వర్ (ఒరిస్సా)లో ఉంటున్నాము. ఇద్దరు పిల్లలు. శ్రీవారితో, పిల్లలతో — పశ్చిమ బెర్లిన్‌లో గడిపిన పన్నెండు నెలల జీవితం-జీవితంలో మరపురాని విశేషం. ఆసక్తి: రచనలు, సంగీతం. తొలిరచన 1974లో 'తరుణ'లో ప్రచురించబడిన "స్నేహ దోషం". నా రచనలు కూడా ఎక్కువగా "వసుంధర" కలంపేరుతో వస్తుంటాయి.

—వసుంధర

లేదు' అంది తను. సావిత్రికి దాపరికం లేదు. ఆ క్రితం రాత్రి, రామారావు హోటల్లోంచి వస్తూ మా ఆయనకి కనపత్తాడని మా ఆయన ఏదో మాటల్లో చెప్పడం గుర్తుకువచ్చి 'హోటల్నుంచి తెచ్చుకొని తిన్నారా?' అని అడిగాను. లేదండీ. ఇద్దరం ఉపవాసం చేశాం. పాపం ఆయనకేదైనా టిఫిన్ చేసి పెట్టాలి వస్తా" అంది. నేను ఆశ్చర్యపోయాను. ఆయన హోటల్లో తిని భార్యకి చెప్పలేదని తెలిసి "రామారావుతో వేగడం కష్టం అంది."

"సావిత్రికికూడా తన అందంతో మొగుణ్ని చెప్పుచేతల్లో వుంచుకోవాలనీ, కొంగుకు ముడేసుకోవాలనీ తాపత్రయాలు లేవంటారా?" అని అడిగింది సుభద్ర.

"లేకేం వుంది: సావిత్రి అందంగా అలంకరించుకొని వయ్యారాలుపోతూ మొగుడితో వీధిలోకి వెళ్ళేది. అతనికి వీధిలో అందరు మొగవాళ్ళకళ్ళు తన భార్యమీదే వున్నాయేమోనని అనుమానంగా ఉండేది "నువ్వు వీధిలో అలా నడిచావు. ఇలా నడిచావు వాడిని రాసుకొన్నావు, వీడిని తాకావు" అంటూ గొడవ చేసేవాడట. సావిత్రి చెప్పేది. పైగా "కామేశ్వరిగార్లా ఇంట్లో ఉండరాదా! నీకింట్లో కాలు నిలవదు" అనేవాడట"

"మీకిన్ని విషయాలు తెలుసునంటే పూర్వం మీ కుటుంబాలు రెండూ చాలా స్నేహంగా ఉండేవన్నమాట. ఇప్పుడంత స్నేహంగా ఉన్నట్టులేదు."

"సావిత్రిద్వారా వాళ్ళ యింటి విషయాలు మా యింట్లో తెలుస్తున్నాయని మా యింటికి సావిత్రి రాకపోకల్ని రామారావు తగ్గించేశాడుట. సావిత్రే చెప్పింది."

"వాళ్ళాయన మాటిమాటికి తననిమీతో పోలుస్తుంటే సావిత్రిగారికే ఉక్రోషం వచ్చి మానేసిందేమో!" సుభద్ర సన్నటి చురక అంటించింది.

కామేశ్వరి కామాటలు రుచించక మౌనంగా వుండిపోయింది.

"మరి వాళ్ళిద్దరు అన్యోన్యంగా ఉండటం ఎప్పుడు ఎలా మొదలైందిట?"

"మీరు పక్క భాగంలోకి వచ్చాక, అందరు మొగుళ్లు మా ఆయన్లాగా ఉండరని, కొందరు భార్యల్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తారని మీ సంసారాన్ని చూశాక రామారావుకి కనువిప్పు కలిగి ఉంటుంది." కామేశ్వరి బదులు తీర్చుకొంది.

"మీరు మరీను! ఇప్పుడు వాళ్ళింట్లో సావిత్రిగారిదే పైచెయ్యి కదా! ఎలా సాధించిందంటారు?"

"ఏడాదిపాటు జరిగిన యుద్ధంలో రామారావు అలిసిపోయి వుంటాడు. సావిత్రి అసలైన సమయాల్లో మొండికేస్తూ వచ్చి వుండాలి. అలాంటప్పుడు ఏ మొగుడైనా దార్లోకి రాకేం చేస్తాడు!" అంది కామేశ్వరి నవ్వుతూ.

"అయితే ఇంకా అప్పుడప్పుడు జరిగే దెబ్బలాటల మాటో?"

పూర్తి ఆధిపత్యం సంపాదించడానికి సావిత్రి, చేజారిన అధికారం చేజిక్కించుకోడానికి రామారావు జరిపే పోరాటాలవి. వాళ్ళు పోట్లాడుకొన్నా ప్రేమలు వలకబోసుకొన్నా ఉధృతంగా, చేస్తారు."

సుభద్ర, కామేశ్వరిల సంభాషణ జరుగుతున్న సమయంలో ఆంబులెన్సు ఆసుపత్రికి జేరింది. ప్రమాదకరమైన పరిస్థితిలో వున్నవారిని వుంచే వార్డులో సావిత్రిని చేర్చారు. డాక్టర్లు వచ్చి చూశారు. సావిత్రి మంచానికి తగిలించిన అట్టమీద ముప్పైశాతం వళ్ళు కాలింది అని వ్రాశారు.

"అంటే అర్థం యేమిటి?" అని శంకరరావు డాక్టర్లని వరండాలో అడిగాడు.

"జాగ్రత్తగా ట్రీట్ చేస్తే వయస్సులో వుంది కనుక బతకచ్చు" అని చెప్పారు వాళ్ళు. ఈ విషయం విన్నాక శంకరరావు రామారావుకి ధైర్యం చెప్పాడు.

నర్సులు అందర్నీ బయటకు పంపించి సావిత్రి వంటికి అంటుకొన్న బాడీని. జాకెట్టుని సున్నితంగా వలిచారు. ఆపైన కాలిన ప్రదేశం అంతా డ్రెస్ చేసి బాండేజి వేశారు. గ్లూకోజ్ డ్రిప్ పెట్టారు, ఇంజక్షన్లిచ్చారు.

బయట నిలబడ్డ సమయంలో శంకరరావు రామారావు నడిగి అతని తల్లిదండ్రుల చిరునామా, సావిత్రి తల్లిదండ్రుల చిరునామా తీసుకొని టెలిగ్రాములివ్వడానికి వెళ్ళాడు. డ్రెస్సింగ్ పూర్తయ్యాక రామారావుకి సావిత్రి మంచం పక్కనే కుర్చీవేసి కనిపెట్టుకొని ఉండమని చెప్పిందో నర్సు. నరసింహమూర్తి వరండాలో కూర్చున్నాడు. శంకరరావు ఓ గంటలో తిరిగి వచ్చాడు.

సావిత్రి రెండు గంటలవేళ కళ్ళు తెరచి పక్కనే కనిపెట్టుకొని కూర్చున్న రామారావుని చూసింది.

"నీ ప్రాణానికేం భయంలేదని డాక్టర్లు చెప్పారు" అన్నాడు రామారావు సావిత్రికి ధైర్యం చెప్తూ. సావిత్రి ఏమైనా అంటుందేమోనని ఆశగా ఎదురుచూశాడు. సావిత్రి కళ్ళు మూసుకొంది. బాండేజీలో ఉన్న ముఖంలో ఏ భావం తెలియలేదు. సావిత్రికి మళ్ళీ మగత కమ్మింది.

నాలుగు గంటలవేళ సావిత్రి మళ్ళీ కళ్ళు తెరచింది. అప్పుడు నరసింహమూర్తి, శంకరరావుకూడా అక్కడే

## మిమిక్రీ మిత్రులు



శ్రీ మిట్టపాటి నాగేశ్వరరావు

వీరి జన్మస్థలం రాజమండ్రి. వీరు B.Com. డిగ్రీ తీసుకున్నారు. వీరు శ్రీ వేణుమాధవ్‌గారికి ఏకలవ్య శిష్యులు. 1975లో మిమిక్రీ ప్రదర్శనలు ప్రారంభించినా అనతి కాలంలో అనేక కార్యక్రమాలలో పాల్గొని తన కళా ప్రావీణ్యాన్ని పలు ప్రాంతాలలో ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. సుమారు 300 ప్రోగ్రామ్సు వరకు యిచ్చారు. వీరు ఆంధ్ర దేశంలోనే కాక బీహార్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కూడా ప్రదర్శనలు యిచ్చారు. వీరు మిమిక్రీ కళాకారులేకాక మంచి స్టేజి నటులు. కాలేజీలో చదివే రోజుల్లో స్త్రీ పాత్రలను ధరించేవారు. వీరు తెలుగు, తమిళ, హిందీ నటీనటుల కంఠస్వరములే కాక, యాంత్రిక ధ్వనులు, హెలికాప్టర్, కేరవిల్లి, జీపు ధ్వనులను, రైలు శబ్దాలను అనుకరిస్తారు. వీరి ఆంగ్ల చిత్రాలలో సన్నివేశాల ధ్వని అనుకరణ జనరంజకంగా వుంటుంది. "Ten Commandments." 'రోబ్'వంటి చిత్రాలసన్నివేశాలను గుర్రపు డెక్క శబ్దాలను. బ్యాక్‌గ్రౌండు ఎఫెక్ట్సుయథాతథంగా ప్రదర్శిస్తారు. వీరు యువకులు. మిమిక్రీ మీద వీరికున్న శ్రద్ధ, గౌరవం శ్లాఘనీయం.

పరిచయకర్త :

— నేరెళ్ళ లక్ష్మణరావు

ఉన్నారు. రామారావు వాళ్ళని "సావిత్రి కేమన్నా కావాలేమో అడగండి. నేను అడిగితే మాట్లాడదేమో" అని అర్థించాడు.

నరసింహమూర్తి "ఏమన్నా కావాలా సావిత్రిగారూ?" అని అడిగాడు.

సావిత్రి బలహీనంగా "నా పాప! జ్యోతి" అని మాత్రం అనగలిగింది.

"సీత దగ్గర ఆడుకొంటూంది. ఇంటికి వెళ్ళి తీసుకువస్తాను" అన్నాడు శంకరరావు.

సావిత్రి రామారావు కేసి తదేకంగా చూసి కళ్ళు మూసుకొంది.

సాయంత్రం డాక్టర్లు వచ్చి సావిత్రిని పరీక్షించి "మర్నాటి పొద్దున వరకు బతికితే తిప్పుకొన్నట్టే" అని చెప్పారు. ఆరు గంటల వేళ "మేం ఇంటికి వెళ్ళి జ్యోతిని తీసుకువస్తాం" అని చెప్పి బయల్దేరారు శంకరరావు, నరసింహమూర్తి.

ఇద్దరు ఇంటికి వెళ్ళి స్నానాలు చేశారు. పొద్దున నుంచి "మీరు రెండు మెతుకులైనా తినలేదని" కామేశ్వరి, సుభద్ర ఆర్భాటం చేశారు. జ్యోతికి తల దువ్వి మంచి ఫ్రాకు వేశారు. శంకరరావు సీతని, కృష్ణుడిని చూస్తానని యింటి దగ్గర వుండిపోయాడు. నరసింహమూర్తి తను ఆ రాత్రికి రామారావుకి తోడుగా పడుకొంటానని చెప్పి ఓ దిండు, దుప్పటి తీసుకొన్నాడు. కామేశ్వరి సుభద్ర, జ్యోతిని తీసుకొని రామారావుకోసం భోజనం తీసుకొని నరసింహమూర్తితో ఆస్పత్రికి బయల్దేరారు.

రామారావుని బలవంతంగా కూచోబెడితే కంచంలోని భోజనాన్ని కెలికి తిన్నాననిపించాడు. అన్నం తిని లేచి జ్యోతిని ప్రేమగా యెత్తుకొన్నాడు.

ఎనిమిది గంటల వేళ సావిత్రికి మళ్ళీ మగత విడింది. రామారావు దగ్గరున్న జ్యోతివైపు శ్రమపడి కొద్దిగా చేతులు చాచింది. జ్యోతి బాండేజీల్లో ఉన్న తల్లిని గుర్తుపట్టలేదు. రామారావు మంచంమీద కూర్చుని జ్యోతిని సావిత్రి ముఖానికి దగ్గరగా ఉంచాడు జ్యోతి చేతుల్ని సావిత్రి ముఖానికి తాకించాడు. జ్యోతి భయపడి ఏడ్చింది.

"నేనిలా నీకు భయం కలిగించేలా తయారైంది నీ కోసమే తల్లీ!" అని చెప్పాలనుకుంది సావిత్రి కాని నోట మాటలు రాలేదు. కళ్ళలో నీటి బొట్టు లేర్పడ్డాయి.

కామేశ్వరి, సుభద్ర, సావిత్రిని సానుభూతితో చూసారు. "జ్యోతికేం బెంగలేదు. మేం చూస్తాం" అంది సుభద్ర.

"మీకు త్వరగా తగ్గిపోతుంది" అంది కామేశ్వరి.

వాళ్ళిద్దరు జ్యోతిని తీసుకొని యింటికి వెళ్ళిపోయారు. నరసింహమూర్తి రామారావుకి తోడుగా వుండిపోయాడు. రాత్రంతా వంతులవారి సావిత్రిని కనిపెట్టుకొని కూర్చున్నారు వాళ్ళిద్దరు.

తెల్లారింది, లోకమంతా చీకట్లు పోగొట్టి కొత్తవెలుతురు నింపుతున్నాడు సూర్యుడు. సావిత్రి ముఖం తేటపడింది. రాత్రి డ్యూటీ డాక్టరు పొద్దున్నే సావిత్రిని పరీక్షించి "గండం గడిచింది. ఇంక ఈవిడ కోలుకొంటుంది" అన్నాడు. రామారావు ముఖం విడింది. అతని మనస్సులోకి వెలుగు వ్యాపించింది.

"నేను ఈవిడ దగ్గర కూర్చుంటాను. మీరు కాస్త కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ తాగిరండి" అని రామారావుని నరసింహమూర్తి పంపాడు. నరసింహమూర్తి సావిత్రిని "మీకెలా వుంది?" అని అడిగాడు. తగ్గిందన్నట్టుగా సౌంజ్ఞ చేసింది. నరసింహమూర్తి ఆ కబురు ఈ కబురు చెప్పాడు. ఆమె తల్లిదండ్రులు లారోజు రైల్లో రావచ్చునని ధైర్యం చెప్పాడు. తాము పోలీసుల్తో అది ప్రమాదం అని చెప్పారని చెప్పి అది ఎలా జరిగిందని చెప్పారో కూడా చెప్పాడు. "రామారావు స్వతహాగా మంచివాడు. జరిగిందేదో జరిగిపోయింది. అదృష్టం మనపట్ల వుండి మీరు బతికారు మళ్ళీ ఇలాంటి పని చెయ్యకండి. రామారావుగారిని కాస్తఅర్థంచేసుకోండి." అని హితవు బోధించాడు.

నరసింహమూర్తి సావిత్రికి చేసిన హితబోధ అప్పుడే వచ్చిన రామారావు విన్నాడు. సావిత్రితో మాట్లాడుతున్న నరసింహమూర్తి చెల్లెలితో మాట్లాడుతున్న అన్నయ్యలాగా అనిపించాడు. పూర్వం ఈయన్తో మాట్లాడిందనా తను సావిత్రిని అనుమానించాడు! రామారావు సిగ్గుపడ్డాడు.

రామారావుకి సావిత్రిని అప్పజెప్పి నరసింహమూర్తి ఆసుపత్రినుంచి ఇంటికి వెళ్ళాడు. తన భాగం గుమ్మంముందు నిలబడి, సావిత్రి సంధిగ్ధావస్థ దాటేసిందని శంకరరావుకి చెప్పాడు. కాఫీ తాగుతూ కామేశ్వరి, సుభద్ర గుమ్మాలకి ఆనుకొని నిలబడి వింటున్నారతను చెప్పేది.

ఆ సమయంలో ఆ మూడు భాగాల ముంగిట్లో ఒక సైకిల్‌రిక్షా వచ్చి ఆగింది. అందులోంచి ముసలితనపు పొలిమేరల్లో వున్న దంపతులు దిగారు. రిక్షావాడిని పంపించేసి "సావిత్రీ వాళ్ళ భాగం ఏది?" అని అడిగారు.

కామేశ్వరి ఆ భాగం చూపించి "మీరు వాళ్ళకేమౌతారు?" అని అడిగింది.

"సావిత్రి మా అమ్మాయి. మా అమ్మాయికి వంట్లో బాగా లేదని టెలిగ్రాము అందొచ్చాం. ఇంటికి తాళం వేసుంది- మరి మా అమ్మాయి ఆసుపత్రిలో వుందా?" అని కంగారుపడింది వచ్చినావిడ.

"సావిత్రిగారు వాళ్ళు ఈ ఇంట్లోకి వచ్చాక మీరెప్పుడూ రాలేదు. అందుకని అడిగాను ఉండండి" అంటూ కామేశ్వరి లోపలికి వెళ్ళి తాళంచెవితెచ్చి యిచ్చింది. సీత జ్యోతిని తీసుకొనిబయటకు వచ్చింది.

సావిత్రి తండ్రి తెచ్చిన సంచీలోపల పెట్టాడు. సావిత్రితల్లి "మా అమ్మాయికేం అయింది? జ్యోతిఇక్కడెందుకని ఒంటరిగా వుంది? మా అల్లుడేడీ?" అని అడిగింది అదురుతున్న గుండెలతో.



"మీరు మొహాలు కడుక్కొని కాఫీ తాగండి. అన్నీ తీరుబడిగా చెప్తాం" అన్నాడు శంకరరావు.

వాళ్ళు అన్నీ రైల్లోనే పూర్తయ్యాయి అన్నారు.

ఇంతలో సుభద్ర కాఫీ కలిపి తీసుకు వచ్చింది. వాళ్ళు కాఫీ తాగుతుంటే శంకర రావు టూకీగా పోలీసులకి చెప్పిన కథే సావిత్రి తల్లిదండ్రులకి చెప్పాడు. నరసింహమూర్తి, సావిత్రి ప్రమాదావస్థ నుంచి బయటపడిందని చెప్పాడు.

సావిత్రితల్లి "ఎంతపని జరిగిందేతల్లీ! నీ మొగుడెప్పుడో నిన్ను చంపేస్తాడని అనుమానిస్తూనే ఉన్నానే తల్లీ!" అంటూ ఏడుపు మొదలుపెట్టింది.

ఆ అభియోగానికి ఆమె భర్తతప్ప అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు.

"ఆయన అల్లాంటివాడుకాదు. అయినా ఏం జరిగిందో మేం చూశాంకదా!" అన్నాడు శంకరరావు.

"ఏమిటి చూశారు? మండిపోతున్న నా కూతుర్ని చూసారు! అంతేగాని నా కూతురికెలా వళ్ళంటుకొందో చూశారా?" అని అడిగాడు సావిత్రి తండ్రి.

శంకరరావు గొంతుకలో పచ్చి వెలక్కాయ పడింది. తామంతా రామారావు పిలవగానే వెళ్ళి సాయం చేసినట్టు చెప్తున్న అబద్ధపు కథలో మంట ఎలా అంటుకొందో తాము చూడలేదు!

"ఇష్టం లేకపోతే విడిచిపెట్టేయాలి! అంతేగాని కాల్చిచంపడం ఎందుకు నాయనా?" అంది సావిత్రి తల్లి ఏడుస్తూ, అక్కడ లేని రామారావుని ఉద్దేశించి.

"మీ అమ్మాయి, అల్లుడూ చాలా అన్యోన్యంగా వుంటారు. మాకుతెలుసు. సావిత్రిగార్ని అంత ఆపేక్షగా చూసుకొనే రామారావుగారి గురించి మీరింత నీచంగా మాట్లాడ్తుంటే మాకు కొంచెం కష్టంగా వుంది" అన్నాడు నరసింహమూర్తి.

"కారణం లేకుండా యెందుకంటాం? సావిత్రి మాకు రాసే ఉత్తరాల్లో దాన్ని అతను పెడ్తున్న హింసగురించి చాలాసార్లు రాసింది" అన్నాడు సావిత్రి తండ్రి.

"ఎందుకు హింసిస్తున్నాడోకూడా రాసిందా?" అని కామేశ్వరి అడిగింది. ఆమె మనస్సులో అనుమానపు గొడవలున్నాయి.

"నా భార్య పేరుమీద ఓ యిల్లుంది. అది దాని తదనంతరం సావిత్రికి వస్తుందని పెళ్ళికి ముందర చెప్పాం. మా వియ్యాలవారు సరేనన్నారు. కాని ఈమధ్య వాళ్ళు ఆ యిల్లు యిప్పుడే సావిత్రి పేర పెట్టించుకొంటే మంచిదని రామారావుకి నూరిపోశారు. అతను "ఆ యిల్లు నీ పేర పెట్టించుకో" అని సావిత్రిని కాల్చుకు తినడం మొదలుపెట్టాడు" అన్నాడు సావిత్రి తండ్రి.

## కొబ్బరి వడలు

**కావలసిన వస్తువులు :**

కొబ్బరికాయ 1, మినపప్పు - 1 టీ స్పూన్, ఆవాలు ¼ స్పూన్ ఎండు మిరప కాయలు 10 పెద్ద సైజు, ఉల్లిపాయలు 2.

తయారుచేయు విధానం : కొబ్బరి కాయ తురిమి ఒక గిన్నెలో కొబ్బరి కోరు, ఉల్లిపాయ ముక్కలు, చిటికెడు పసుపు, సరిపడ ఉప్పువేసి నీరు పోయకుండా స్టౌ మీద పెడితే నీరు ఇగిరిపోయాక దించి పెట్టుకొని. బూర్లెమూకుడులో 1 స్పూన్ నూనె వేసి ఆవాలు, మినపప్పు దోరగా వేయించి దింపిన తర్వాత కొబ్బరి, పచ్చిమిర్చి, ఆవాలు, మినపప్పువేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమము నిమ్మకాయ సైజు వుండలు చేసి అర చేతిలో వల్చగా వత్తి డాల్డాలో వేయిస్తే చాలా రుచిగా ఉంటాయి.

—ఎమ్. మహేశ్వరి

సావిత్రి ఇంట్లో జరిగే గొడవలు తనకే చెప్పగా లేంది తల్లిదండ్రులకి ఉత్తరం వ్రాసుండదా! వ్రాసే వుంటుంది అనుకొంది కామేశ్వరి. "మీ అమ్మాయివాళ్ళి ఇంట్లోకి వచ్చి రెండేళ్ళపైగా అయింది కాని, మీరెప్పుడూ రాలేదెందుకని?" అని అడిగింది కామేశ్వరి వాళ్ళని.


"ఏం చెయ్యం తల్లీ!వస్తే మా అల్లుడు పేచీపెట్టి ఇక్కడ కిక్కడే బలవంతంగా దస్తావేజులు రాయించుకొంటాడేమోనన్న భయంతో రాలేదు" అంది సావిత్రి తల్లి.

"పెళ్ళికి ముందు మీరు మీ అల్లుడి గురించి, వియ్యాలవారి గురించి విచారించలేదా?" అని అడిగింది సుభద్ర.

"పిల్లాడు బంగారం లాంటి వాడు ఏ చెడు అలవాటులేదు. ఎలాంటి దుబారా ఖర్చులు చెయ్యడు." అని చెప్పారమ్మా తెల్సినవాళ్ళు. మా అన్నయ్య జ్యోతిష్యంలో దిట్ట. వాడు జాతకాలు చూసి పూర్తిగా ఒకదాని కొకటి గొప్పగా నప్పాయి అని అన్నాడు. ఆఖరికిదీ వైభోగం. దుబారా చెయ్యడంటే మురిసిపోయాంగాని పెళ్ళానికి, కూతురికి గుడ్డ ముక్కకూడా కొనడాని కిష్టపడని పిసినారి అనుకోలేదు" అంది ఆవిడ.

"మీరు స్నానాలు చేసి టిఫిన్‌చేసి ఆసుపత్రికి వెళ్దురుగాని" అని అసలు విషయం గుర్తుకుచేశాడు నరసింహమూర్తి. ఆపైన శంకరరావుతో "నేనివాళ సెలవు పెడ్తున్నాను. మీరుకూడా పెట్టండి రామారావుగారి తల్లిదండ్రులుకూడా వచ్చాక మనం నక్కకి తప్పుకోవచ్చు" అన్నాడు.

మరో గంట తరువాత శంకరరావు



REGD.

SEALED PACKING ... TABLETS
AVAILABLE AT ALL CHEMISTS

Mfrs: SEENU & CO., MADRAS-21

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

ఉబ్బసానికి
మూలిక

ఉబ్బసాన్ని తగ్గించే మూలిక ఒకటి రాజస్థాన్ వాసవ్యులు స్వర్గీయ శంభునాథ్‌గారి మనుమడు శ్రీ కేశవమోహన్‌లాల్‌చే (పేదవారికి) పంచి పెట్టబడుతున్నది.

ఈ మూలికను ఒకసన్యాసి శ్రీశంభునాథ్‌కు ఇచ్చారు నలభై సంవత్సరాలకు పైగా ఆయన ఉచితంగా పంచిపెట్టారు. ఆయన నిస్వార్థసేవకు మెచ్చి ప్రభుత్వం పింఛను ఇచ్చింది. ఈ సత్కార్యాన్ని తన మనుమనికి అప్పగించి ఆయన సన్యాసి ఆశ్రమము స్వీకరించెను. ఇప్పుడు ఆయన మనుమడు ఈ కార్యభారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే భాగ్యవంతులకు ఈ సత్కార్యానికి విరాళమీయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకమంది ఉబ్బసం రోగులు దీర్ఘకాలవ్యాధి పీడితులు కూడా ఈ మూలిక మూడు మోతాదులు సేవించి ఉపశమనం పొందారు. రోగులు ఈ మూలిక కోసం ఇంగ్లీషులోమాత్రమే వ్రాయండి.

శ్రీ కేశవ మోహన్‌లాల్
పో. బా. నెం. 11463, కలకత్తా-6.

(Print Art/K)

సావిత్రి తల్లిదండ్రుల్ని ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ రామారావుని వాళ్ళు దుర్భాషలాడారు. రామారావు నోరు విప్పలేదు. ఆసుపత్రి సిబ్బంది అక్కడ గొడవచేస్తే బయటకు పంపించేస్తామని సావిత్రి తల్లిదండ్రుల్ని హెచ్చరించారు.

"ఎలా వుందే అమ్మా నీకు ?" అని తల్లి సావిత్రిని పలకరించింది కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ.

"తగ్గింది" అంది హీనస్వరంతో సావిత్రి.

"రామారావుగారు మీరు నిన్న పొద్దున నుంచి ఇంటికి వెళ్ళలేదు కదా! జ్యోతి బెంగ పెట్టుకొంటుంది మీరు కూడా కనపడకపోతే. మీరింటికి పదండి స్నానం అదీ చేద్దురుగాని" అని శంకరరావు.రామారావుని బయల్దేరదీశాడు.

పొద్దున పది గంటలవేళ పోలీస్ ఇన్‌స్పెక్టర్,ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఒక కానిస్టేబుల్ ఆసుపత్రికి వచ్చారు. సావిత్రికింకా పూర్తిగా ఓపిక రాలేదని, ఆమెను ప్రశ్నించవద్దని డాక్టర్లు చెప్పారు. ఆమె తల్లిదండ్రులు వచ్చినట్టుకూడా చెప్పారు.

పోలీస్ కానిస్టేబుల్‌ని పంపి, ఇన్‌స్పెక్టరు సావిత్రి తల్లిదండ్రుల్ని బయటికి పిలిపించాడు. ఇన్‌స్పెక్టర్ లౌక్యుడు.

"నేనూ ఆడపిల్లతండ్రినే! నా కూతురు అత్తవారింట్లో కాపురం చేస్తోంది. ఆడపిల్లలు అత్తవారింట్లో పడే బాధలు నాకు తెలుసు. నేను ప్రపంచం మీద పడి వొళ్లుకు తింటానని మా అల్లుడి అభిప్రాయం. అందుకని నన్ను వొళ్లుకు తింటాడతను. దానికి మా అమ్మాయిని అడ్డుపెట్టుకొంటాడు. అందుకని నన్ను మీతోటి వాడిగా అనుకొని మీ కేమైనా బాధలుంటే నాకు చెప్పండి" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మా అల్లుడు పెద్దగా హింసలు పెట్టకపోయినా సాధించి చంపేవాడు. ఆ చావుకంటే ఈ చావు నయం అని మా అమ్మాయి ఇంతపని చేసింది" అన్నాడు సావిత్రి తండ్రి.

"జరిగింది ప్రమాదం అంటున్నారు చుట్టుపట్లవారు. మీరు ఆత్మహత్యా ప్రయత్నం అంటున్నారు. మీకేమైనా ఆధారాలున్నాయా?" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మా అమ్మాయి అప్పుడప్పుడు తనకి జీవితం దుర్భరంగా ఉంటోందని వ్రాసిన ఉత్తరాలు మాత్రమే మాకున్న ఆధారం" అంటూ ఒక వుత్తరాన్ని యిన్‌స్పెక్టర్‌కి అందించాడు. జేబులోంచి తీసి "ఇది మూడు రోజులక్రితం వ్రాసింది. నా పర్సులో వుండిపోయింది."

పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆ వుత్తరం తీసుకొని "మంచిది. మీ అమ్మాయి త్వరలో కోలుకొంటుందని ఆశిస్తున్నాను. మీ అమ్మాయి స్టేట్‌మెంటిస్తే మేము చర్య తీసుకోడానికి వీలుంటుంది. వస్తాం" అని సెలవు తీసుకొన్నాడు.

రామారావు స్నానంచేసి బట్టలు మార్చుకొని శంకరరావింటికి వచ్చాడు. కృష్ణుడు, సీత స్కూళ్ళకి వెళ్ళారు. రామారావు టిఫిన్ తింటుంటే సుభద్ర అడిగింది.

"మొన్న రాత్రి సినిమాలో సావిత్రిగారు సరదాగానే వున్నారుకదా. ఆవిడకి నిన్న పొద్దునకి ప్రాణం తీసుకొనే ప్రయత్నం చెయ్యాల్సిన అవసరం ఏమొచ్చింది?"

"ఏమీ రాలేదు. నిన్న ఆ క్షణంలో ఉద్రేకంతో చేసిన పని అది. సినిమాలో పాప వేసుకున్న ఫ్రాకు లాంటిది ఈ దీపావళికి జ్యోతికి కొనాలంది సావిత్రి. అంత ఖరీదైన ఫ్రాకు కొనడానికి నా దగ్గర డబ్బు లేదన్నాను" అన్నాడు రామారావు. జ్యోతి తండ్రి ఒడిలో ఆడుకొంటోంది. ఆ పాపకి తండ్రి తనకి ఫ్రాకు కొననన్నాడన్న విషయం అర్థం కాదు. అందుకని తండ్రిమీద ప్రేమేగాని కోపం లేదు. తండ్రిదగ్గర నిశ్చింతగా ఆడుకొంటున్న జ్యోతికి తండ్రి లోటు చేస్తున్నాడని కదా సావిత్రి అంతపని చేసింది అనుకొన్నాడు శంకరరావు. రామారావు తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు.

డబ్బులేకపోవడానికి మీకేం ఖర్మ. మీరు బుల్లి జమీందారు కదా! మీ వాటాకి వచ్చే భూమిమీద శిస్తు మీ వాళ్ళని పంపించమనండి" అంది సావిత్రి.

"మీ అమ్మగారు తన పేర్న ఉన్న యిల్లు నీ పేర్న పెట్టినప్పుడు మా వాళ్ళు నావాటా శిస్తు నాకు పంపుతారు" అన్నాను రెండూ జరిగేవి కావన్న ధోరణిలో. దాంతో గొడవైంది. జ్యోతిని సీతకిచ్చి వచ్చి, నన్ను మాట్లాడనీకుండా నన్నూ,నా వాళ్ళని చాలా మాటలంది. చివరికి "మీ వాళ్ళేం తక్కువ తినలేదు"అన్నాను. దాంతో ప్లేటుముందు కూర్చుని అట్లు తింటున్న నన్ను లేవగొట్టి బయటకి తోసేసి తలుపులు బిడాయించింది. ఆ తరువాత జరిగిన కథ మీకు తెలుసు" అని ముగించాడు రామారావు.

పది పదకొండు గంటల మధ్య రామారావు తల్లిదండ్రులు బస్సులో వచ్చారు. వాళ్ళని చూసి నరసింహమూర్తి,కామేశ్వరి కూడా రామారావు యింటికివచ్చారు. శంకరరావు, సుభద్ర అక్కడే వున్నారు.

"ఏమిట్రా వడిలిపోయిన తోటకూర కాడలావుంది నీ మొహం." అంటూ కుశల ప్రశ్నలు వెయ్యటం మొదలుపెట్టింది రామారావుతల్లి. ఆవిడలో కొడుకు క్షేమంగా వున్నాడన్న సంతృప్తి కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. కోడలు గురించి మాటవరుస కడిగింది.

నరసింహమూర్తి పోలీసులకి చెప్పిన కథే చెప్పాడు. అన్నీ సర్దుకొన్నాక అసలు కథ వాళ్ళకెల్లాగో తెలుస్తుంది. అంతవరకూ ఇలా చెప్పడమే మంచిదని అనిపించి.

ఇంతలో ఆసుపత్రినుంచి బయల్దేరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఇంటికి వచ్చాడు.

"భర్తతో దెబ్బలాడని భార్యలుండరు. మా ఆవిడ, నేను ఏరోజూ టైము కింటికి రానని నన్నూ, నా ఉద్యోగాన్నీ తిట్టని రోజుండదు. సినిమాలకితీసుకువెళ్ళలేదని, చీరలు కొనలేదని సాధింపులు ఉండనే ఉన్నాయి. అది ఆడవాళ్ళ నైజం" అని ఆడవాళ్ళవైపు తిరిగి "ఇలా అంటున్నందుకు మీరంతా నన్ను క్షమించాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆడవాళ్ళెవ్వరు ఆ మాటలకి నవ్వలేదు.

"మీకు, మీ ఆవిడకి ఏమైనా గొడవ లయ్యాయా ఈ మధ్య?"

రామారావు గొను కొనడం విషయంలో తనకి, సావిత్రికి జరిగిన దెబ్బలాటగురించి చెప్పి "అసలే కోపంగా వుంది. పైగా ఆ సమయంలో స్టౌలు ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాయి. సావిత్రి కోపంగా వాటిని బాత్రూమ్‌లోకి తీసుకువెళ్ళింది. తనవెంట నేను వెళ్ళాను. మంట ఆర్పకుండానే వాటిని విసురుగా బాగుచెయ్యబోయింది. కిరసనాయిలు చీరమీద ఒలికి చీరంటుకొంది. సావిత్రి పెరట్లోకి పరుగెత్తింది, నేను వెనకాతలే పరుగెత్తి చీర లాగేశాను. అందుకే ప్రాణానికి ముప్పు రాలేదు" అని చెప్పాడు రామారావు.

రామారావు అంత సహజంగా, తొణకకుండా అబద్ధం చెప్తుంటే ఆ ప్రమాదాన్ని చూసిన సాక్షులు ఆశ్చర్యపోయారు.

"మీరు మీ భార్యని కష్టపెట్టేవారని దానికి వారిదగ్గర సాక్ష్యాలున్నాయని అంటున్నారు మీ అత్తవారు. నేను నమ్మలేదనుకోండి. కాని నా డ్యూటీ ప్రకారం నేను విచారించాలికదా!"

"తను నీళ్ళలా ఖర్చుపెట్టడానికి నా జీతం చాలడంలేదని మా ఇంటి నుంచి డబ్బు తెప్పించమని అనేది. నేను ఉద్యోగస్థుడినై వుండి మా నాన్నని డబ్బు అడగటం చిన్నతనమనిపించి అడిగేవాడిని కాదు. సావిత్రి ఇల్లాంటి విషయాలన్నీ ఇంటికి రాసేది. వాళ్ళు సావిత్రికి బుద్ధి చెప్పటంపోయి నన్ను వేరుపడి నా వాటా భూమి నన్ను తీసుకోమని సలహాలు రాస్తూ వచ్చారు" అన్నాడు రామారావు.

రామారావు తండ్రి కల్పించుకొని "మా వియ్యపురాలికి ఆవిడ తల్లినుంచి సంక్రమించిన యిల్లుంది. అది తన తదనంతరం మా కోడలికి వస్తుందని పెళ్ళికిముందు చెప్పారు. మేం సరేనన్నాం. వాళ్ళు తనని నానుంచి వేరు పడమని సలహా లిస్తున్నారని మా అబ్బాయి వుత్తరంరాస్తే నీ పెళ్ళానికి నీ జీతం చాలకపోతే వాళ్ళమ్మ పేరునున్న యిల్లు తన పేరు మీదకి మార్పించుకొని, అద్దెకిచ్చి అద్దె డబ్బులు జల్సా చెయ్యమను" అని నాకువళ్ళుమండిపోయి రాశాను ఆ విషయం. మా కోడలు తండ్రికి రాసింది కాబోలు. మా వియ్యంకుడు తన కూతురు మా యింట్లో చాలా బాధలు పడ్తున్నట్టు తెలిసిందని అలా అయితే తనని వాళ్ళు వాళ్ళింటికి తీసుకువెళ్తారని వుత్తరం రాశాడు. ఆ వుత్తరం నా దగ్గర భద్రంగా మా వూళ్ళోవుంది" అన్నాడు.

"మీ అమ్మాయిని మీరు పుట్టింటికి తీసుకుపోతామని రాస్తే ఇక్కడెవరూ బెదిరేవారు లేరు. మా అబ్బాయికి రెండో పెళ్ళిచేస్తాం అని మేమూ బెదిరించాం" అంది రామారావు తల్లి.

"మీకు మీకు ఆస్తి గొడవలున్నాయన్న మాట. మీ కోడలి స్టేట్‌మెంటు తీసుకోందే ఏ విషయం తేల్చుకోలేం" అని ఓ చిన్న టపాకాయ పేల్చి ఇన్‌స్పెక్టర్ వెళ్ళాడు.

ఆ సాయంత్రం సావిత్రి తండ్రి, పోలీసులకో ఉత్తరం అందజేసినట్టు రామారావు తల్లిదండ్రులకి తెలిసి మండిపడ్డారు. పెద్ద గొడవయింది. "మీ అమ్మాయి ఆసుపత్రి నుంచి రాగానే ఆత్మహత్యా నేరం మోపి పోలీసులు లాక్కెళ్తారు" అన్నాడు రామారావు తండ్రి వెటకారంగా.

"మీ అబ్బాయి మా అమ్మాయి వంటిమీద కిరసనాయిలు పోసి నిప్పంటించేశాడని మేము అప్పుడే చెప్పేశాం. పోలీసులేం తెలివితక్కువవాళ్ళు కారు హంతకులని వదిలెయ్యడానికి" అన్నాడు సావిత్రి తండ్రి. రామారావు, అతని తల్లిదండ్రులు బెదిరిపోయారు, ఆ మాటలైతే అన్నాడు కాని సావిత్రి తండ్రికి కూడా సాక్ష్యం రామారావు నిర్దోషి అని బలంగా వుందని తెలియకపోలేదు. అంచేత మిగిలింది ఆత్మహత్యా ప్రయత్నమా? ప్రమాదమా? అన్న విషయం. మొదటిదే అని తేలితే సావిత్రికే ప్రమాదం. అందుకని సావిత్రి తండ్రికూడా బెదిరాడు.

మర్నాడు సావిత్రి జరిగిన గొడవను పెంచడం ఇష్టంలేనట్టు తనకు జరిగింది ప్రమాదవశాత్తేనని స్టేట్‌మెంటిచ్చింది. ప్రమాదం జరిగిన నాలుగోరోజు రామారావుని అతని తల్లిదండ్రుల్ని పిలిచి పోలీస్ ఇన్‌స్పెక్టర్. "జరిగింది ప్రమాదమేనని ఈసారికి నమ్ముతున్నాను. మరోసారి ఎంత చిన్న ప్రమాదం జరిగినా పూర్తి విచారణ జరుపుతాను. జాగ్రత్తగా ఉండండి" అని హెచ్చరించాడు. "మీరు మీ భార్యతో కొంచెం సర్దుకుపోవడం నేర్చుకోండి. కొత్త జీవితం మొదలు పెట్టండి" అని రామారావుకి ప్రత్యేకంగా చెప్పాడు.

రామారావు తల్లిదండ్రులు వాళ్ళ ఊరు వెళ్ళిపోయారు. సావిత్రి తల్లిదండ్రులు సావిత్రి యింటికి వచ్చాక రెండు రోజులుండి వెళ్ళిపోయారు. వెళ్ళిపోతూ "తల్లీ! మేం ఇంకా బతికేవున్నాం. ఏదైనా భరించలేని బాధ కలిగితే వచ్చి మా దగ్గరుండు. అంతేగాని ఏ అఘాయిత్యం చెయ్యకు" అని చెప్పి వెళ్లారు.

* * *

"సావిత్రికి, రామారావుకి ఆస్తులున్నాయని తెలియదు నాకిన్నాళ్ళు" అంది కామేశ్వరి.

"డబ్బు లేక మనుష్యులు లేమిని అనుభవించరు తృప్తిలేక అనుభవిస్తారు కాని" అన్నాడు నరసింహమూర్తి.

* * *

సావిత్రి అందమైన నున్నటి చర్మం, కాలిన మచ్చలతో అందవికారంగా తయారైంది. జ్యోతి కొద్దిరోజుల్లో తల్లి కొత్త రూపానికి అలవాటుపడి చేరువైపోయింది. రామారావు పిలిచినా సావిత్రి అతనితో షికార్లకు వెళ్ళదు. తను మంచి మంచి చీరలు కట్టుకొని అందంగా తయారై తన చీర కొంగుకి భర్తను ముడేసుకోవాలన్న సావిత్రి కోరిక కాలి బూడిదైపోయింది.

"నా భర్తకు నా రూపంతో పనివుంది. అందుకని ఆయన నాకు దూరం కావచ్చు. నా జ్యోతికి నా రూపంతో పనిలేదు. దానికి నేను కావాలి! దానికోసం నేను బతుకుతాను" అనుకొంది సావిత్రి.

జ్యోతి వెలుగులో మనస్సులోని చీకట్లు పటాపంచ లయ్యాయి. సీత, కృష్ణుడు వెలిగించిన చిచ్చుబుడ్లు చుట్టూ కాంతులు విరజిమ్మాయి. ●